భెల్ ఎంఐజీ కాలనీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన కాలనీ అసోసియేషన్ సభ్యులు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీ సమగ్రాభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. భెల్ ఎంఐజీ కాలనీ అసోసియేషన్, కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డిల ఆధ్వర్యంలో 3వ సారి ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీని గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జి.మోహన్‌గౌడ్, నాగమణి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్‌రావు, ఉపాధ్యక్షులు నారాయణగౌడ్, కార్యదర్శి సుబ్బారావు, డైరెక్టర్లు నీలకంఠం, రాము, నాయకులు బూస్, భాస్కర్‌ముదిరాజ్, కుమార్, తిలావత్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో డ్రైవింగ్ చాలా ప్రమాదకరం



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, డాక్టర్లు

కాంటినెంటల్ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ గురుఎన్ రెడ్డి

రాయదుర్గం: నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని (వరల్డ్ స్లీప్ డే)ను పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ విభాగం, 50 మంది తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నతోద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్లనే భారత దేశంలో 40 శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించేందుకు డ్రైవర్లంతా నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడిపేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్, ఆర్టీసీ మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్. శైలజామూర్తి, డాక్టర్ పి శ్రీనివాస్ మాట్లాడారు. ఏఎన్సీ ఇన్ఫోటెక్ ఉపాధ్యక్షుడు అరుణ్ బోడ, ఇతర సంస్థల ప్రతినిధులతో బాటు వైద్యులు పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని నాగళ్ళ, న్యూరో సర్జన్స్ డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ రణధీర్‌కుమార్,ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని మంత్రికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మియాపూర్: మియాపూర్‌లోని సర్వేనంబర్ 100, 101లో ఉన్న ప్రభుత్వ భూమిపై సుప్రీంకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఉన్నా కూడా ధరణిలో పట్టా పాసు పుస్తకం ఇవ్వడంపై సమగ్ర విచారణ చేయాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ధరణిలో అక్రమాలు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మియాపూర్ సర్వేనంబర్ 100,101లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గతంలో కొందరు కబ్జాలు చేశారని పలు న్యాయస్థానాల్లో ఓటమి చెంది చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ భూమిపై సుమారు 25 సంవత్సరాల నుండి స్టేటస్‌కో అమల్లో ఉందని, ఈ భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఓ వైపు కోర్టు ఆదేశాలు ఉన్న 100 సర్వే నంబర్‌లో ధరణి పట్టా పాసుపుస్తకం ఎనిమిది ఎకరాల భూమిని సాయిబాబా పేరుపై గత సంవత్సరం ఏప్రిల్ 22న జారీ చేశారని.. విచారణ జరపాలని భాస్కర్‌రెడ్డి కోరారు.

టీ వర్క్స్‌ను సందర్శించిన ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధి బృందం



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలో భారతదేశపు అతిపెద్ద నమూనా కేంద్రంగా గుర్తింపు పొందిన టీవర్క్స్ ప్రాంగణాన్ని శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అందులో కమిటీలైన ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ సెల్(ఐడీసీ) సంయుక్త ప్రతినిధి బృందం సందర్శించింది. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, ఐసీటీ చైర్మన్ మోహన్‌రాయుడు, ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ళ నాయకత్వాలలో ప్రతినిధుల బృందం సందర్శించింది. టీ వర్క్స్ పనితీరును అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్ మాట్లాడుతూ తెలంగాణలో ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి మా నిబద్ధతత టీ వర్క్స్ సందర్శన ద్వారా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ ఎంసీపీఐయూ అభ్యర్థిగా సుధాకర్



వనం సుధాకర్‌కు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మియాపూర్: మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌కు చెందిన ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్‌ను చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ నాయకులు, కార్యకర్తలు వనం సుధాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ తాండ్ర కళావతి, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు దశరథ్ నాయక్, నాయకులు లావణ్య, శివాని,లలిత, అరుణ, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం దారి మూసివేత

మణికొండ: మున్సిపల్ కార్యాలయానికి రెండు వైపుల నుంచి ఉన్న దారులలో ఒకటి మూసి వేస్తున్నారు. మణికొండ మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు సమయంలో ఎక్కడా అనువైన భవనం లేక పోవటంతో పుప్పాలగూడలోని డ్వాక్రా భవనాన్ని మున్సిపల్ కార్యాలయానికి తీసుకున్నారు. అందులోను సరిపోను స్థలం లేక గత సంవత్సరం పైన రేకులతో మరో అంతస్తు పెంచుకున్నారు. అయినా సౌకర్యవంతంగా లేక పోవటంతో జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరిస్తూ లేఖ రాశారు. దాంతో అప్పటి కలెక్టర్ మణికొండ ల్యాంకోహిల్స్ పక్కన 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అందులో నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి రెండు దారులు ఉన్నాయి. అలా ఉండవద్దని గతంలో ఎంతో మంది అధికారులకు తెలిపారు. అయినా వారు ఆ విషయాన్ని పట్టించుకోకుండా విధులు నిర్వర్తించారు. కొత్తగా వచ్చిన కమీషనర్ మాత్రం ఆవిషయాన్ని గమనించి వాయువ్యంలోని దారిని మూసి వేసే పనులను చేపట్టారు. ఇటీవలనే మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం, గతంలో ఏఈ, డీఈలు సస్పెండ్ కావటం, టీపీఓలు సస్పెండ్, అకస్మిక బదిలీలు, మేనేజర్ సస్పెండ్ కావటంతో ఎందుకైనా మంచిదని వాయువ్యం దారిని మూసివేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మండల పరిధిలో 25 పరీక్షా కేంద్రాలు.. 5,660 మంది విద్యార్థులు
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం



లేని చోట వాటిని ఏర్పాటు చేస్తున్నారు

శేరిలింగంపల్లి: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు మార్చి 18వ తేదీన ప్రారంభం అవుతాయి. మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 5,660 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు.

- శేరిలింగంపల్లి మండలంలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,660 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.పరీక్షా కేంద్రాలను మండల విద్యాధికారి వెంకటయ్య పరిశీలించి ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షించారు.
- ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- విద్యార్థులను 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ప్రతి క్లాస్‌రూమ్‌లో ఒక ఇన్విజిలేటర్ పర్యవేక్షణలో 20మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు.
- ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు.
- పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ముందు సీల్డ్ కవర్‌లోని పేపర్లు తీసేలా ఏర్పాట్లు
- జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో సీసీ కెమెరాలు లేని చోట వాటిని ఏర్పాటు చేస్తున్నారు

పరీక్షా కేంద్రాలు ఇవే..

శేరిలింగంపల్లి మండల పరిధిలో 25 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి

- ఎంఎస్ఆర్ హైస్కూల్, నాగార్జున హైస్కూల్, విద్యావాణి హైస్కూల్, న్యూ నేషనల్ స్కూల్ (చందానగర్), అక్షయ ఫౌండేషన్ స్కూల్ (నల్లగండ్ల)
- జిల్లా పరిషత్ హైస్కూల్ శేరిలింగంపల్లి, విద్యానికేతన్ స్కూల్ తారానగర్,
- శారద విద్యానికేతన్, ది ఇండో ఇంగ్లీష్ హైస్కూల్ (మియాపూర్), జిల్లా పరిషత్ హైస్కూల్ (మియాపూర్).
- కెపిఆర్ విద్యాలయ (మదీనాగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొత్తగూడ), విద్యా హైస్కూల్ (అంజయ్యనగర్ గచ్చిబౌలి),
- న్యూ బ్లూమ్ హైస్కూల్, శ్రీ గౌతమి గ్రామర్ హైస్కూల్, శారదా హైస్కూల్ (కొత్తగూడ),
- జిల్లా పరిషత్ హైస్కూల్ (కొండాపూర్)జీవీఆర్ హైస్కూల్ (కొండాపూర్)
- జిల్లా పరిషత్ హైస్కూల్ (గచ్చిబౌలి),
- జిల్లా పరిషత్ హైస్కూల్ మాదాపూర్, స్వాతి హైస్కూల్ (మాదాపూర్)
- యునైటెడ్ హైస్కూల్, సెయింట్ ఇసాక్ అడ్వెంట్ స్కూల్ (న్యూ హఫీజ్‌పేట్)
- రాయదుర్గంలో జిల్లా పరిషత్ హైస్కూల్, నాగార్జున పాఠశాల (రాయదుర్గం)లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

శేరిలింగంపల్లి మండల పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో వసతులు ఉన్న స్కూళ్ళలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. డ్రింకింగ్ వాటర్, ఫ్యాన్స్, లైట్స్ ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఏర్పాట్లపై స్వయంగా కేంద్రాలను పరిశీలించాము. – కె.వెంకటయ్య, ఎంఈఓ, శేరిలింగంపల్లి మండలం

కమ్మ కార్పోరేషన్ ఏర్పాటుపై ఎమ్మెల్యే హర్షం

గచ్చిబౌలి: కమ్మ కార్పోరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కమ్మ కులంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉపాధికి కమ్మ కార్పోరేషన్ ఎంతగానో తోడ్పడుతుంద న్నారు. ఈ సందర్భంగా కమ్మ సంఘాల సమాఖ్య తెలంగాణ గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఎమ్మెల్యే గాంధీ, ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణ ప్రసాద్, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పాతూరి వెంకట్‌రావు, చంద్రమౌళి తదితరులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

శంకుస్థాపన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నాని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్, శ్రీసాయినగర్ కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నామని వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అన్నారు.శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల సంఘం డైరీ, ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలతో పాటు సీనియర్ అధ్యాపకులు ఉన్నారని,ల్యాబ్, గ్రంథాలయం వసతులు ఉన్నాయని, విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ లచ్చయ్య ,కళాశాల యూనిట్ అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి రవీందర్, కోశాధికారి డాక్టర్ ఎన్.జానారెడ్డి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అల్లంరెడ్డి, సీనియర్ సహా ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జిపికె కృష్ణ తెలిపారు.



హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి దివి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు, పండగలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి కాలంలో ధరించే దుస్తులు ఆకట్టుకుంటున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో నటి ఊర్మిళా చౌహాన్, స్రవంతితో పాటు పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

శాంటామరియా విద్యార్థుల దాతృత్వం

శేరిలింగంపల్లి: విద్యతోపాటు దాతృత్వ గుణాన్ని అలవర్చుకొన్నారు శేరిలింగంపల్లిలోని శాంటామరియా స్కూల్ విద్యార్థులు. ఐఎస్‌పీ స్ట్రీట్ చైల్డ్ యునైటెడ్, హీల్ ఏ చైల్డ్ అనే రెండు సంస్థల కోసం నిధులను సేకరించారు. ఒక్కొక్కటి లక్షకు పైగా విరాళాలు సేకరించడం విశేషం. స్ట్రీట్ చైల్డ్ యునైటెడ్ సహకారంతో విరాళాలు సేకరించి వీధుల్లో నివసించే పిల్లలకు భవిష్యత్తును అందించడానికి చర్యలు చేపట్టారు. హీల్ ఏ చైల్డ్ అనేది ఆర్థికంగా వెనుకబడిన వారికి సరైన విద్య ,వైద్యం అందక పోరాడుతున్న పిల్లల క్లిష్టమైన సమస్యలపై దృష్టి సారిస్తుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రుచిరాఘోష్ మాట్లాడుతూ పిల్లలు దాతృత్వ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషానిచ్చిందన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో 283, 284, 620, 627 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిన్నారం తహశీల్దార్ భిక్షపతి, డిప్యూటీ తహశీల్దార్ మల్లిఖార్జున్, ఆర్ఐ జయశంకర్ నారాయణ, సర్వేయర్ రామభద్రల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో 15 నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేయించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన, ఆక్రమించినా కఠినంగా వ్యవహరిస్తామని తహశీల్దార్ భిక్షపతి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

గచ్చిబౌలి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం రెల్లబల్లి గ్రామానికి చెందిన సుజిత్‌కుమార్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోన విప్రో సర్కిల్‌లోని సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేస్తున్నాడు. గౌలిదొడ్డిలోని పీజీ హాస్టల్‌లో నివాసముంటున్నాడు. 11వ తేదీ ఉదయం నుంచి కనబడడం లేదని ఫోన్ స్విచాఫ్ వస్తోందని బంధువులు పేర్కొన్నారు. హాస్టల్, సంస్థ కార్యాలయంలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆయన మేనమామ కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టు పనుల్లో వేగం పెంచాలి

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్ టైప్ కల్వర్టు, డ్రైన్ పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బాక్స్‌టైప్ కల్వర్టు పనుల్లో వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలకు మార్గం సుగుమం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో ఏళ్ళుగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటితో రాకపోకలు నిలిచిపోతున్నాయని సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ టైప్ కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

దూర విద్య కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) ఆధ్వర్యంలో దూరవిద్యా కోర్సులకు దరఖాస్తు గడువును పెంచారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా బ్లెండెడ్ మోడ్ ద్వారా అందించే ఒక సంవత్సరం డిప్లొమో కోర్సుల కోసం దరఖాస్తులను కోరుతోంది. ఈ కోర్సులు యూజీసీ, ఏఐసీటీఈ, డీఈసీ జాయింట్ కమిటీచే ఆమోదించబడిన కోర్సులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ నుంచి ప్రాస్పెక్టస్ డౌన్ లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పీజు రసీదుతోపాటు సెక్షన్ ఆఫీసర్ సెంటర్ ఫర్ డిస్టెన్ అండ్ వర్చువల్ లెర్నింగ్‌కి పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 040-24600264, 040-24600265లో సంప్రదించాలి.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 20, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 50, దొండ 35, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 300.

ఓటరు అవగాహన ర్యాలీ

పటాన్‌చెరు టౌన్: ఓటు తోనే యువత భవిష్యత్తు ముడిపడి ఉంటుందని నెహ్రు యువ కేంద్ర జిల్లా వాలంటీర్ అజయ్ యాదవ్, రుద్రారం ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు షరీపుద్దీన్ అన్నారు. శుక్రవారం నెహ్రు యువ కేంద్ర ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలం రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత, భవిష్యత్ తరాలకు ఎలాం ఉపయోగపడుతుందో వివరించారు.ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టీచర్ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

పశుసంవర్ధకశాఖ జేడీ డా.వసంతకుమారి

పటాన్‌చెరు టౌన్: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వసంతకుమారి తెలిపారు. శుక్రవారం జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి గోశాలలో ప్రారంభించారు. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. 27 మండలాలు 647 గ్రామాల్లో 1,69,455 పశువులు ఉన్నాయన్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 72 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి ఓ బృందం వెళ్లి పశువులకు టీకాలు వేస్తారన్నారు. మూడు నెలలు పైబడిన పశువులన్నింటికీ ఈ టీకాలు వేయించాలన్నారు. ఆమెతో పాటు సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశ్వరరావు కిష్టారెడ్డిపేట పశువైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ విశ్వ చైతన్య, సిబ్బంది సుభేష్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎస్సీ, ఎస్టీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సీతామహాలక్ష్మి సూచించారు. జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలను సీతామహాలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. బోధన గురించి ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం వసతి, తరగతి గదులు, వంటశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాని రోడ్‌షోలో శేరిలింగంపల్లి నేతలు

గచ్చిబౌలి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొన్న విజయ సంకల్ప రోడ్‌షోకు శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. మియాపూర్ న్యూకాలనీ శివాలయం వద్ద జెండా ఊపి రవికుమార్‌యాదవ్ ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంటు సీటు బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్డారం వేంకటేశ్వర ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానించిన మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని శుక్రవారం నియమించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌గా లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు. నూతనంగా ఏర్పాటైన కమిటీకి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులు దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు డాకయ్యసాగర్, రవీందర్ గౌడ్, గంగమ్మ,ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మల్లారెడ్డి, శివానందం, ప్రభు, రామచంద్రారెడ్డి, అశోక్, ముత్యాల రవీందర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, నర్సింహగౌడ్, మల్లేశం గౌడ్, రఘుపతిరెడ్డి, స్థానిక నాయకులు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి



హఫీజ్‌పేట్: యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓల్డ్ ఎంఐజీ నల్లగండ్ల అండర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి (50) శుక్రవారం ఉదయం పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం అతడిని గమనించి వెళ్ళి పరిశీలించగా మృతి చెందాడని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై నల్ల బనియన్, ప్యాంటు ఉన్నాయని, త్రిశూలం, ఓం టాటూ ఉన్నాయన్నారు. అతడి వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.